# ప్రజల మాట ప్రగతి బాట

# జూబ్లీహిల్స్ నియోజకవర్గం

## నామినేషన్లకు ఏర్పాట్లు పూర్తి..

- నేటినుంచి నామినేషన్ పత్రాలు పంపిణీ..
- సమాచారం కోసం హెల్ప్‌డెస్క్ ఏర్పాటు..
- ఓటరు చైతన్యానికి స్వీప్ కార్యక్రమాలు..
- జూబ్లీహిల్స్ ఎన్నికల రిటర్నింగ్ ఆఫీసర్ రవి



జూబ్లీహిల్స్, నవంబర్ 1 : అసెంబ్లీ ఎన్నికల నామినేషన్లకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు సికింద్రాబాద్ ఆర్డీఓ, జూబ్లీహిల్స్ ఎన్నికల రిటర్నింగ్ ఆఫీసర్ రవి పేర్కొన్నారు. ఈనెల 30 న జరగనున్న ఎన్నికలకు నవంబర్ 3 నుంచి నామినేషన్లు స్వీకరించనుండగా.. నవంబర్ 2నుంచి అభ్యర్థులకు నామినేషన్ పత్రాలు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ఈ మేరకు షేక్‌పేట్‌లోని తాసీల్దార్ ఆఫీస్‌లోని జూబ్లీహిల్స్ రిటర్నింగ్ ఆఫీసర్ కార్యాలయంలో ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. నామినేషన్లు ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు స్వీకరించనున్నందున సంబంధిత కార్యాలయంలో భారీ గోడ గడియారంతో పాటు వీడియోగ్రాఫర్, సీసీ కెమెరాలు.. తదితర భద్రతా ఏర్పాట్లు చేపట్టినట్లు తెలిపారు. ప్రధానంగా అభ్యర్థులకు అవసరమైన సమాచారాన్ని అందించేందుకు హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

***ఇంటిపై పోలింగ్ స్టేషన్‌ల నంబర్‌లు..***

అసెంబ్లీ ఎన్నికల్లో వందశాతం ఓటింగ్ లక్ష్యాన్ని చేరేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా ప్రతి ఇంటిపై ఓటు ప్రాధాన్యతను వివరించే స్లిప్‌లను అంటిస్తున్నట్లు తెలిపా రు. ఆయా స్లిప్‌లు వేసిన చోట పోలింగ్ స్టేషన్‌ల నంబర్లను కూడా వేయనున్నట్లు తెలిపారు. దీంతో ఓటరు నేరుగా పోలింగ్ స్టేషన్‌కు చేరుకునే వీలుంటుందని అన్నారు. అంతేకాక సీనియర్ సిటిజన్‌లు, పర్సన్ విత్ డిజేబుల్ (పీడబ్ల్యూడీ) ఓటర్లు ఇంటివద్దే ఓటు వేసేందుకు ఫారం–12–డీ పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు.

***ఓటరులో చైతన్యానికి స్వీప్ కార్యక్రమాలు..***

వందశాతం ఓటింగ్‌ను స్వీప్ చేసేందుకు జిల్లా ఎన్నికల అధికారి ఆదేశాలతో అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా ఓటరులో చైతన్యానికి స్వీప్ కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. పాఠశాలలు, కళాశా లలు, పార్కులు, కూడళ్లలో ఈ అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. నామినేషన్ల ఘట్టానికి ముందు ఈ అవగాహన కార్యక్రమాలను ముగించనున్నట్లు తెలిపారు. ఓటరును ప్రలోభాలకు గురిచేసేవారిపై నిఘా పెట్టనున్నట్లు తెలిపారు. అర్హులందరూ ఓటు హక్కును సద్వినియోగం చేసుకో వాలని కోరారు.

## ర్యాంప్‌ల నిర్మాణం పూర్తి : ఈఈ రాజ్‌కుమార్

జూబ్లీహిల్స్,నవంబర్ 1: పోలింగ్ స్టేషన్‌లలో ర్యాంప్‌ల నిర్మాణం పూర్తి చేసినట్లు ఈఈ రాజ్‌కుమార్ తెలిపారు. ఎన్నికల సంఘం ఆదేశాలతో అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా పోలింగ్ బూత్‌ల్లోకి ప్రవేశించే వృద్ధులకు, దివ్యాంగులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ర్యాంప్‌లు ఏర్పాటు చేస్తున్నారు. ఇందులో జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో 329 పోలింగ్ స్టేషన్‌లలోని పోలింగ్ బూత్‌లలో ర్యాంప్‌ల నిర్మాణం చేపట్టినట్లు తెలిపారు. బుధవారం అధికారులతో కలిసి ర్యాంప్‌ల ఏర్పాటు పనులను పరిశీలించారు.

## సాయిబాబా ఆలయ వార్షికోత్సవం



ఎర్రగడ్డ, నవంబర్ 1: బోరబండ డివిజన్, స్వరాజ్‌నగర్‌లోని హరిహర క్షేత్ర దేవస్థాన ప్రాంగణంలోని షిర్డీ సాయిబాబా ఆలయ 28వ వార్షికోత్సవాన్ని బుధవారం నిర్వహించారు. ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం వరకు జరిగిన వివిధ కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం చేపట్టారు. ప్రత్యేక పూజల్లో ఆలయ కమిటీకి చెందిన కల్వల సత్యనారాయణరావు, జి.ముత్యాలు పాల్గొన్నారు.



యూసుఫ్‌గూడలో పాదయాత్ర చేస్తూ ఓటు వేయాలని అభ్యర్థిస్తున్న బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి గోపీనాథ్



వృద్ధురాలైన అరటిపండ్ల వ్యాపారిని సంక్షేమ ప్రభుత్వానికి ఓటు వేయాలని అభ్యర్థిస్తున్న అభ్యర్థి మాగంటి గోపీనాథ్

## బీఆర్ఎస్ అభ్యర్థులకు అఖండ మెజార్టీ ఖాయం..

**జూబ్లీహిల్స్ బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి గోపీనాథ్**

**సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన పథకాలే అభ్యర్థులకు శ్రీరామరక్ష**

**యూసుఫ్‌గూడలో కొనసాగుతున్న ప్రచారం..**

జూబ్లీహిల్స్, నవంబర్ 1 : పేద, బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి ముఖ్యమంత్రి కేసీఆర్‌ను, బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థులను ప్రజలు అఖండ మెజార్టీతో గెలిపించడం ఖాయమని బీఆర్ఎస్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు, జూబ్లీహిల్స్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి మాగంటి గోపీనాథ్ పేర్కొన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ అన్ని వర్గాల సంక్షేమానికి ప్రవేశపెట్టిన పథకాలే అభ్యర్థులకు శ్రీరామరక్షగా నిలుస్తాయని ఉద్ఘాటించారు. బుధవారం యూసుఫ్‌గూడ కార్పొరేటర్, జీహెచ్‌ఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యుడు బండారి రాజ్‌కుమార్ పటేల్‌తో కలిసి ఆయన.. డివిజన్‌లోని బాలాజీ స్వీట్ హౌస్, ఎల్ఎన్ నగర్, శ్రీకృష్ణానగర్ బస్టాండ్ వీధుల్లో, కాలనీల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయా ప్రాంతాల్లో ప్రచార రథానికి ప్రజలు అపూర్వ స్వాగతం పలికారు. పాదయాత్రలో బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి గోపీనాథ్‌కు మహిళలు హారతులు పడుతూ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా కృష్ణానగర్, లక్ష్మీనరసింహనగర్, తదితర ప్రాంతాల్లో బీఆర్ఎస్ ప్రభుత్వ పనితీరును వివరిస్తూ.. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధి పనులను వివరించే కరపత్రాలను పంపిణీ చేశారు. అన్ని వర్గాలను అన్ని విధాలుగా ఆదుకున్న ముఖ్యమంత్రి కేసీఆర్‌ను, బీఆర్ఎస్ అభ్యర్థులను మెజార్టీతో గెలిపించాలని కోరుతూ నిర్వహించిన ప్రచారానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు సంతోష్ ముదిరాజ్, ప్రధాన కార్యదర్శి నర్సింగ్ దాస్, బీఆర్ఎస్ నాయకులు, మహిళా నాయకులు పాల్గొన్నారు.



యూసుఫ్‌గూడలో కరపత్రాలు అందజేసి ఓటు వేయాలని అభ్యర్థిస్తున్న బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి గోపీనాథ్



పాదయాత్రలో వృద్ధురాలిని ఓటు వేయాలని అభ్యర్థిస్తున్న బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి గోపీనాథ్



బోరబండ సైట్–1 కాలనీలో బీఆర్ఎస్ నేత విజయ్‌కుమార్

### గడప గడపకు ప్రచారం..

ఎర్రగడ్డ, నవంబర్ 1: బీఆర్ఎస్ అభ్యర్థి, జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ తరపున బస్తీల్లో బీఆర్ఎస్ నేతలు, కార్యకర్తలు ఎన్నికల ప్రచార స్పీడును పెంచారు. బోరబండ, ఎర్రగడ్డ డివిజన్లలోని బస్తీల్లో గడప గడప ప్రచారం జరుపుతూ జూబ్లీహిల్స్‌కు మాగంటి గోపీనాథ్ చేసిన అభివృద్ధి, సీఎం కేసీఆర్ అందిస్తున్న వరాల గురించి వివరించారు.



సైట్–2 కాలనీలో ప్రచారం చేస్తున్న శివకుమార్ గుప్తా

## బీఆర్ఎస్‌లో చేరిన ఎంఐఎం కార్యకర్తలు




జూబ్లీహిల్స్ నియోజకవర్గంలోని ఎర్రగడ్డ డివిజన్, సుల్తాన్‌నగర్‌కు చెందిన పలువురు ఎంఐఎం కార్యకర్తలు బుధవారం ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. బీఆర్ఎస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలతో తామంతా పార్టీలో చేరామని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నేత జావెద్, తదితరులు పాల్గొన్నారు .

*– బంజారాహిల్స్,అక్టోబర్ 1*

## హత్యా రాజకీయాలను ప్రోత్సహిస్తున్న పార్టీలపై చర్యలు తీసుకోవాలి

**జూబ్లీహిల్స్ రిటర్నింగ్ ఆఫీసర్ రవికి కార్పొరేటర్ల ఫిర్యాదు**



జూబ్లీహిల్స్ రిటర్నింగ్ ఆఫీసర్ రవికి ఫిర్యాదు చేస్తున్న కార్పొరేటర్ల బృందం

జూబ్లీహిల్స్,నవంబర్1 : హత్యా రాజకీయాలకు తెలంగాణలో చోటులేదని.. దుబ్బాక బీఆర్ఎస్ అభ్యర్థిపై హత్యాయత్నాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని జూబ్లీహిల్స్ నియోజకవర్గ కార్పొరేటర్లు సీఎన్ రెడ్డి, రాజ్‌కుమార్ పటేల్, దేదీప్యరావు పేర్కొన్నారు. హత్యా రాజకీయాలను ప్రోత్సహిస్తున్న పార్టీలపై ఎన్నికల నిబంధనల మేరకు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ మేరకు బుధవారం షేక్‌పేట్‌లోని కార్యాలయంలో జూబ్లీహిల్స్ రిటర్నింగ్ ఆఫీసర్ టి.రవిని కలిసి ప్రచారంలో ఉన్న అభ్యర్థిపై హత్యాయత్నానికి పాల్పడిన కాంగ్రెస్ కార్యకర్తపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ వినతిపత్రం సమర్పించారు.